

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 283 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 27-04-2025 | పేజీలు : 5

# మత్స్యకారుల జీవితాలు బాగుచేస్తాం



- **నేరుగా ఇబ్బందులు తెలుసుకుందామనే మీవద్దకొచ్చా**
- **ఫిషింగ్ హార్బర్ పూర్తి, ఐస్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు ఇతర సదుపాయాల కల్పన**
- **బుడగట్లపాలెం మత్స్యకారులతో ముఖాముఖిలో సీఎం చంద్రబాబు నాయుడు**

**ఎచ్చెర్ల, ఏప్రిల్ 26 (జనస్వరం) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎచ్చెర్ల నియోజకవర్గం, బుడగట్లపాలెంలో మత్స్యకారులతో ముఖాముఖి అయ్యారు. మొదట పోలేష్, రామలక్ష్మీ దంపతులతో మాట్లాడారు. పోలేష్ మాట్లాడుతూ.... గ్రామంలో 600 కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయని, సముద్రంలో అలల ఉధృతి సమయంలో బోట్లు తిరగబడి ప్రమాదాలకు గురవుతున్నామని సీఎంకు వివరించారు. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేస్తే వేటకు సులభతరం అవ్వడంతో పాటు ప్రమాదాలు కూడా తగ్గుతాయని సీఎంకు వివరించారు. గత ప్రభుత్వంలో వలలు, మోటార్లు వంటివేమీ మత్స్యాకారులకు అందించలేదని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.... మీ సమస్యలు నేరుగా వినేందుకు బుడగట్లపాలెం వచ్చానని, ఏం చేస్తే మీ జీవితాలు బాగుపడతాయో అడిగి తెలుసుకోవడానికే వచ్చానన్నారు. మత్స్యకారుల సేవలో పథకంలో భాగంగా రూ.20 వేలు ఆర్థిక సాయంగా వేట నిషేధ సమయంలో ఇస్తున్నామని, మీ పిల్లల్ని చదివించుకోవడానికి ఇబ్బంది లేకుండా వచ్చే నెలలోనే తల్లికి వందనం కింద రూ.15 వేల చొప్పున ప్రతి చదువుకునే బిడ్డకు ఇస్తామన్నారు. త్వరలోనే ఫిషింగ్ హార్బర్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఐస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి, ఇతర వసతులు కల్పిస్తాం : సీఎం

అనంతరం మరో మత్స్యకార బృందం వద్దకు వెళ్లిన సీఎం చంద్రబాబు... కారి రాంబాబు, సీతోగ్య, ఎర్రయ్యతో మాట్లాడారు. అర్ధరాత్రి పూట వేటకు వెళ్తామని, తిరిగి సురక్షితంగా వస్తామో, రామో కూడా తెలియని పరిస్థితి అని మత్స్యకారులు వివరించారు. పట్టుకున్న చేపలు తీసుకొచ్చుకునేందుకు అవసరమైన సామాగ్రి, బాక్సులు కూడా లేవని, చిన్న పడవ కావడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఫిషింగ్ హార్బర్ పూర్తి చేస్తే తమతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు కూడా ఉపాధి పొందుతారని మత్స్యకారులు వివరించారు. బోట్లు అద్దెకు తీసుకున్న వారికే చేపలు విక్రయించడం వల్ల పడ్డ కష్టానికి ఫలితం దక్కడం లేదని అన్నారు. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేస్తే మార్కెట్ ఏర్పాటవుతుందని అన్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ... ఫిషింగ్ హార్బర్ పూర్తి చేసి, ఐస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఇతర అవకాశాలు కల్పిస్తే ఎంతమేర ఆదాయం పెరుగుతుందని ప్రశ్నించగా... ఇప్పుడు వచ్చేదానికంటే అదనంగా 50 శాతం వస్తుందని మత్స్యకారులు బదులిచ్చారు. మత్స్యకారులు ఎప్పుడూ టీడీపీకి అండగా ఉన్నారని, అందుకే మీకోసం ప్రత్యేకంగా పథకాలు ప్రవేశపెడుతున్నామని అన్నారు. ఒక ముఖ్యమంత్రి తమ గ్రామానికి రావడం అదృష్టంగా భావిస్తున్నామని మత్స్యకారులు సీఎంతో అన్నారు.

ఆప్యాయంగా పలకరింపు

అనంతరం ఎండుచేపల వ్యాపారులు లక్ష్మమ్మ, సీతమ్మ, పైడమ్మ వద్దకు సీఎం చంద్రబాబు వెళ్లారు. ఏమ్మా బాగున్నారా అంటూ ఆప్యాయంగా పలకరించారు. చేపలు ఎండబెట్టే విధానం, రోజువారీ ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత కమ్యూనిటీ హాల్‌కు చేరుకున్న సీఎం... చేపల బోట్లు మరమ్మతులు చేసే కార్మికులు మైలపల్లి పోతురాజు, కారి రాంబాబుతో కాసేపు సంభాషించారు. చేపలు నిల్వ చేసుకునే ఐస్ బాక్సులు, చేపలు పట్టే వలలను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల దశ మారింది

ఎన్నికల్లో హామీ మేరకు వేట నిషేధ సమయంలో రూ. 20,000 సాయం విడుదల

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల దశ మారిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి.. విడుదల చేశామని, దీని వల్ల 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ. 259 కోట్ల లబ్ధి చేకూరిందని అన్నారు. గత పాలకుల్లా తాను బటన్ నొక్కొచ్చు కానీ అలా చేయనని... ప్రజల మధ్యకు వచ్చి వాళ్ల సమస్యలు తెలుసుకుంటానని అన్నారు. ప్రజలందరికీ సంక్షేమం అందించడమే తన ధ్యేయం అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెంలో మత్స్యకార సేవలో పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. మత్స్యకారులు తురాడ అప్పన్న, అలుపల్లి తవితాయ కుటుంబాలకు చెరో రూ. 20 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

మత్స్యకారులు పడుతున్న కష్టాలు నాకు తెలుసు. జాలర్లు ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలో వేటకు వెళ్లడం, వారు తిరిగి వచ్చే వరకూ ఆడబిడ్డలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎదురుచూడటం నేను స్వయంగా చూశాను. కొందరు బోట్లన్నీ కొని మీ సగం ఆదాయం కొట్టేస్తున్నారు. మీ కష్టాలు తీర్చేందుకు నేనున్నాను. జాలర్లు మాటకు కట్టుబడి ఉంటారు. మత్స్యకార గ్రామాలకు గ్రామాలు టీడీపీకి అండగా నిలబడ్డాయి. వెనుకబడిన వర్గాల సంక్షేమం తెలుగుదేశం ధ్యేయం. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10,000 నుంచి రూ.20,000కు పెంచాం.

అభివృద్ధి అంటే.. గత పాలకుల్లా బటన్ నొక్కడం కాదు

గత పాలకుల్లా బటన్ నొక్కి ప్రచారం చేసుకోవడం నాకూ వచ్చు. కానీ చేయాల్సింది అది కాదు. ప్రజలందరికీ సంక్షేమం అందించడమే నా ధ్యేయం. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా? 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టింది. 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టాము. అంతేకాకుండా వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇచ్చింది. మత్స్యకారుల పిల్లలకు ప్రత్యేకంగా 6 రెసిడెన్షియల్ పాఠశాలు ఏర్పాటు చేశాము. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నాము. మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నాము. వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నాం.

చేపల ఎగుమతుల్లో ఏపీ టాప్

రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయి. అయినా నేను బుడగట్లపాలెంకు ఎందుకొచ్చానంటే ఇక్కడి నుంచే జాలర్ల దశదిశా మార్చాలని. చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందువరుసలో ఉంది. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం మన రాష్ట్రం నుంచే ఉంటోంది. ఏపీ నుంచే 32 శాతం మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయి . మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. చేపల పెంపకం వల్ల ఎన్నో లాభాలున్నాయి. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తినాలి. మనుషుల్లో తెలివితేటలు, పిల్లల మెదడు చురుకుగా పనిచేయాలంటే చేపలు తినాలి.

దేశమంతా శ్రీకాకుళం వాసులే

హైదరాబాద్, ఢిల్లీ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో శ్రీకాకుళం కాలనీ ఉంటుంది. ఆర్మీలో శ్రీకాకుళం వాసులున్నారు. జిల్లాలో తెలివితేటలున్న నాయకులుకు కొరత లేదు. నాగావళి, వంశధార ద్వారా నీరు సమృద్ధిగా వస్తుంది. జిల్లా వెంబడి ఎక్కువ జాతీయ రహదారులు ఉన్నాయి. బంగారం పండే భూములు, గనులున్నాయి. ఇక్కడి ఎమ్మెల్యే ఈశ్వర రావు మంచి వాక్ చాతుర్యం కలిగిన వ్యక్తి. ఈ జిల్లాకు చెందిన టీడీపీ కార్యకర్త అప్పలనాయుడు ఎంపీ అయ్యాడు. ముచ్చటగా మూడోసారి గెలిసిన రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రి అయ్యాడు. విశాఖ వాసులు తలసరి ఆదాయంలో ముందుంటే రాష్ట్రం మొత్తంలో తక్కువ తలసరి ఆదాయం వచ్చే జిల్లా శ్రీకాకుళం. నేను భోగాపురం ఎయిర్ పోర్టు తీసుకొస్తే గత పాలకులు దాన్ని అటకెక్కించారు. మళ్లీ నేనే దాన్ని పూర్తిచేస్తాను. ఆనాడు నా మిత్రుడు ఎర్రన్నాయుడు కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ఉద్దానంకు నీళ్లు తెచ్చారు. ఆయన కుమారుడు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో భోగాపురం పూర్తి కాబోతోంది. రామ్మోహన్ నాయుడు పనితీరును ఢిల్లీ నాయకులు గొప్పగా చెబుతున్నారు. అయితే శ్రీకాకుళం అభివృద్ధి కాకపోతే నీ డిగ్రీ తిరిగి ఇవ్వాల్సిందేనని రామ్మోహన్ కు నేను తేల్చి చెప్పాను.

గత పాలకులు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారు

ఎన్డీఏ ప్రభుత్వం వచ్చి పది నెలలయింది. ఎన్నో సమస్యలున్నాయి 4వ సారి ముఖ్యమంత్రిగా చేస్తున్న నాకే సమస్యలు అర్థం కావడంలేదు. గత ప్రభుత్వం నుంచి రూ. 10 లక్షల కోట్ల అప్పు వారసత్వంగా వచ్చింది. ఆ సొమ్ము ఏం చేశారో లెక్కలు లేవు. నా ఇబ్బందులు మీకు చెప్పి మిమ్మల్ని ఇబ్బంది పెట్టను. ఎన్ని సమస్యలు ఉన్నా ప్రజలను ఆదుకుంటాను. ఇలాంటి సభలు గడిచిన ఐదేళ్లలో ఎలా జరిగాయో మీకు తెలుసు. గత పాలకులు వస్తున్నారంటే మీ కొబ్బరిచెట్లు గోవిందా...ఒక నాయకుడు వస్తే చెట్లు నరికేయడం, పరదాలు కట్టేయడం చూశాం. కొందరిని ఇంట్లో నుంచి బయటకు రానివ్వకుండా నెత్తిన చెయ్యి పెట్టేవారు. ఐదేళ్లు అభివృద్ధి ఆగిపోయింది. పెట్టుబడులు లేవు. పరిశ్రమలు పారిపోయాయి. దీనివల్ల చాలా నష్టం జరిగింది. 2019 తర్వాత కూడా టీడీపీ అధికారంలో ఉండుంటే రూ. 7 లక్షల కోట్ల సంపద పెరిగేది. దీనివల్ల ప్రతి ఇంటికి రూ. 50 నుంచి 70 వేలు తలసరి ఆదాయం పెరిగేది.


ఎచ్చెర్లను అభివృద్ధి చేస్తా

ఎచ్చెర్ల నియోజకవర్గం ప్రజల తలసరి ఆదాయం తక్కువ ఉంది. ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం. ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతాం. నియోజకవర్గంలో స్కిల్ డెవలెప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. 9 ఫిషింగ్ హార్బర్లు సిద్ధం చేస్తున్నాం. బోట్లు కొనిచ్చి గ్రామాన్ని ఒక సెంటర్ గా తీసుకుని ఆర్థికంగా ఆదుకుంటాం. ఈ గ్రామంలో 499 ఇళ్లు ఉన్నాయి . 18 మందికి ఇంటి జాగా లేదు. 6 నెలల్లోగా ఇళ్లు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశిస్తున్నాను. స్థానిక ఎమ్మెల్యే ఈశ్వర రావు బాగా పనిచేస్తున్నారు. మిత్రపక్షాలను కలుపుకుపోతున్నారు. రిజర్వాయర్లు సహా కాలువలు పూర్తిచేసి ఎచ్చెర్లను సస్యశ్యామలం చేసే బాధ్యత తీసుకుంటాం.

అందరికీ సంక్షేమం అందిస్తాం

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 200కు పైగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. పేదలకు రూ. 4,000 పింఛు ఇస్తున్నాం. దీపం 2 పథకం కింద 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. టీచరు పోస్టులు భర్తీ చేస్తున్నాం. రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదిలో మూడు విడతల్లో రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తాం. జూన్ నాటికి తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ. 15 వేలు అందిస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 270 సేవలు అందిస్తున్నాం. వాటిని 1,000కి పెంచుతాం. భావనపాడులో పోర్టు కట్టాలనుకున్నాం. గత పాలకులు దాన్ని మూలపేటకు తెచ్చారు. ఐదేళ్లు ఆలస్యమైంది. రాబోయే సంవత్సరంలో మూలపేట పోర్టు పూర్తిచేస్తాం. అనకాపల్లిలో రూ. లక్ష కోట్ల పెట్టుబడితో స్టీల్ ప్లాంట్ వస్తోంది. దీనివల్ల 40 వేల మందికి ఉపాధి లభిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 27 ఏప్రిల్ 2025,**

**తిథి : శుద్ధ అమావస్య (28తా తె.01:04వ.కు),**

**నక్షత్రం : రేవతి (తె.03:40వ.కు)**

**బ్రహ్మ ముహూర్తం : తె.04:13ల తె.05:01**

**రాహుకాలం : సా.04:48ల సా.06:22,**

**యమగండం : మ.12:05ల మ.01:40,**

**వర్జ్యకాలం : రా.09:10ల రా.10:45,**

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 27 ఏప్రిల్ 2025,**

**ఫజర్ : తెల్లవారుజామున గం. 04:45**

**సూర్యోదయం : ఉదయం గం. 05:58**

**జొహర్ : మధ్యాహ్నం గం. 12:18**

**అసర్ : సాయంత్రం గం. 03:25**

**మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:36**

**ఇష : రాత్రి గం. 07:51**




**జన స్వరం**

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను.. అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# ఆధ్యాత్మిక శాంతిని పొందే పవిత్రమైన రోజు





## ఎడిటోరియల్

### వైశాఖ అమావాస్య : ఒక పవిత్ర యాత్ర

వైశాఖ మాసం, తెలుగు పంచాంగంలో ఒక పవిత్రమైన మాసంగా పరిగణించబడుతుంది. ఈ మాసంలో వచ్చే అమావాస్య, అంటే చంద్రుడు కనిపించని రోజు, హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంటుంది. 2025 సంవత్సరంలో, ఏప్రిల్ 27న వైశాఖ అమావాస్య వస్తుంది. ఈ రోజు పితృదేవతలకు తర్పణం ఇవ్వడానికి, స్నాన దాన ధర్మాలు ఆచరించడానికి, ఆధ్యాత్మిక శాంతిని పొందడానికి ఒక అద్భుతమైన అవకాశంగా భావించబడుతుంది. ఈ కథ ద్వారా, వైశాఖ అమావాస్య ప్రత్యేకతను, దాని ఆధ్యాత్మిక మహత్యాన్ని ఒక హృదయస్పర్శియైన కథనంలో చూద్దాం.

**కథ : శాంతి యాత్ర**

గోదావరి నదీ తీరంలో ఉన్న ఒక చిన్న గ్రామంలో, రామయ్య అనే వృద్ధుడు నివసిస్తుండేవాడు. రామయ్య ఒక సాధారణ రైతు, కానీ అతని హృదయంలో ఆధ్యాత్మిక జ్ఞానం ఒక దీపంలా ప్రకాశించేది. ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో అమావాస్య రోజున, రామయ్య తన గ్రామంలోని పితృదేవతల గుడికి వెళ్లి, తన పూర్వీకులకు తర్పణం ఇచ్చేవాడు. ఈ సంప్రదాయం తన తాత గారి నుంచి తనకు వచ్చిన వారసత్వంగా భావించేవాడు. 2025లో ఏప్రిల్ 27 సమీపిస్తుండగా రామయ్య గుండెలో ఒక వింత ఆందోళన మొదలైంది. అతని ఏకైక కొడుకు కిరణ్ హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కిరణ్ ఆధునిక జీవనశైలికి అలవాటు పడ్డాడు. సంప్రదాయాలను పెద్దగా పట్టించుకునేవాడు కాదు. "ఈ పితృకార్యాలు, తర్పణాలు ఏమిటి నాన్న? ఇవన్నీ కేవలం మూఢనమ్మకాలు," అని కిరణ్ ఒకసారి రామయ్యతో వాదించాడు. ఆ మాటలు రామయ్య గుండెలో గుచ్చుకున్నాయి, కానీ అతను నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఈ సంవత్సరం, వైశాఖ అమావాస్య సందర్భంగా, రామయ్య కిరణ్‌ను గ్రామానికి రమ్మని ఆహ్వానించాడు. "కొడుకూ, ఈ రోజు నీవు నాతో పాటు పితృకార్యంలో పాల్గొనాలి. ఇది నీకు కూడా ముఖ్యం," అని రామయ్య చెప్పాడు. కిరణ్ మొదట విముఖత చూపించినా, తండ్రి మాటను తిరస్కరించలేక గ్రామానికి వచ్చాడు.

**వైశాఖ అమావాస్య రోజు :**

ఏప్రిల్ 27, 2025 ఉదయం, సూర్యోదయానికి ముందే రామయ్య కిరణ్‌ను గోదావరి నదీ తీరానికి తీసుకెళ్లాడు. వైశాఖ మాసంలో నదీ స్నానం చేయడం అత్యంత పుణ్యకరమని రామయ్య వివరించాడు. "ఈ మాసంలో నీటిలో సకల దేవతలు కొలువై ఉంటారు. స్నానం చేస్తే, మనసు పవిత్రమవుతుంది," అని చెప్పాడు. కిరణ్, సంశయంతోనే అయినా, నదిలో స్నానం చేశాడు. చల్లని నీరు అతని శరీరాన్ని తాకినప్పుడు, అతని మనసులో ఒక వింతైన శాంతి ఆవరించింది. స్నానం తర్వాత, రామయ్య కిరణ్‌ను గ్రామంలోని పితృదేవతల గుడికి తీసుకెళ్లాడు. అక్కడ, ఒక పురోహితుడు వైశాఖ అమావాస్య ప్రాముఖ్యతను వివరించాడు. "ఈ రోజు పితృదేవతలకు తర్పణం ఇవ్వడం వల్ల వారి ఆత్మలు శాంతిని పొందుతాయి. అదే సమయంలో, మనకు వారి ఆశీస్సులు లభిస్తాయి. వైశాఖ మాసం శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం కాబట్టి, ఈ రోజు చేసే పుణ్యకార్యాలు అక్షయ ఫలితాలను ఇస్తాయి," అని పురోహితుడు చెప్పాడు. రామయ్య, కిరణ్‌కు తర్పణ విధానాన్ని నేర్పించాడు. నీటితో, తిలలతో, దర్భలతో తర్పణం చేస్తూ, రామయ్య తన పూర్వీకుల పేర్లను ఉచ్చరించాడు. కిరణ్, మొదట సంకోచించినా, తండ్రి భక్తిని చూసి తానూ అదే విధంగా చేశాడు. ఆ క్షణంలో, కిరణ్‌కు తన కుటుంబ చరిత్ర, తన పూర్వీకుల త్యాగాలు, వారి ఆశీస్సుల ప్రాముఖ్యత గురించి ఒక కొత్త అవగాహన కలిగింది.

**వైశాఖ అమావాస్య ప్రత్యేకతలు :**

**పితృకార్యాలకు ఉత్తమ రోజు :** అమావాస్య రోజు పితృదేవతలకు తర్పణం ఇవ్వడానికి అత్యంత పవిత్రమైన రోజుగా భావించబడుతుంది. వైశాఖ మాసంలో ఈ రోజు చేసే తర్పణం వల్ల పితృదోషాలు తొలగిపోతాయని నమ్మకం.

**స్నాన దాన ధర్మాలు :** వైశాఖ మాసంలో నదీ స్నానం, లేదా పవిత్ర జలాశయాల్లో స్నానం చేయడం ద్వారా శరీరం, మనసు పవిత్రమవుతాయి. ఈ రోజు దానం చేయడం, ముఖ్యంగా నీరు, చల్లని పానీయాలు, గొడుగులు, చెప్పులు వంటివి దానం చేయడం అక్షయ ఫలితాలను ఇస్తుంది.

**శ్రీ విష్ణు ఆరాధన :** వైశాఖ మాసం శ్రీ మహావిష్ణువుకు అంకితం చేయబడిన మాసం. అమావాస్య రోజున విష్ణువును తులసీ దళాలతో పూజించడం వల్ల ఆధ్యాత్మిక శాంతి, ఐశ్వర్యం లభిస్తాయి.

**మోక్ష ప్రాప్తి :** వైశాఖ మాసంలో ఆచరించే ధర్మకార్యాలు ఇహలోకంలో సౌఖ్యాన్ని, పరలోకంలో మోక్షాన్ని ప్రసాదిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

**కథ ముగింపు :**

తర్పణం పూర్తయిన తర్వాత, రామయ్య కిరణ్‌తో ఒక చిన్న కథ చెప్పాడు. "నీవు నీడను చూస్తావు కదా, కొడుకూ? అది నీతో ఎప్పుడూ ఉంటుంది, కానీ నీవు దాన్ని పట్టించుకోవు. అలాగే, మన పూర్వీకుల ఆత్మలు మనతో ఎప్పుడూ ఉంటాయి. వారికి తర్పణం ఇవ్వడం అంటే, వారి నీడను గౌరవించడం. అది మనకు శాంతిని, బలాన్ని ఇస్తుంది." ఆ మాటలు కిరణ్ హృదయాన్ని తాకాయి. ఆ రోజు సాయంత్రం, గ్రామంలోని విష్ణు ఆలయంలో జరిగిన హారతి కార్యక్రమంలో కిరణ్ పాల్గొన్నాడు. తులసీ దళాలతో విష్ణువును పూజించినప్పుడు, అతని మనసు ఒక అనిర్వచనీయ శాంతితో నిండిపోయింది. హైదరాబాద్‌కు తిరిగి వెళ్లే ముందు, కిరణ్ తన తండ్రిని గట్టిగా కౌగిలించుకుని, "నాన్న, ఈ సంప్రదాయం విలువ నాకు ఇప్పుడు అర్థమైంది. నీతో పాటు ప్రతి సంవత్సరం ఈ రోజున ఇక్కడ ఉంటాను," అని చెప్పాడు.

**వైశాఖ అమావాస్య ఆచరణలు :**

**నదీ స్నానం :** గోదావరి, కృష్ణా, గంగా వంటి పవిత్ర నదులలో స్నానం చేయడం లేదా ఇంట్లో స్నానం చేసేటప్పుడు పవిత్ర జలాన్ని స్మరించడం.

**తర్పణం :** పితృదేవతలకు నీరు, తిలలు, దర్భలతో తర్పణం ఇవ్వడం.

**విష్ణు పూజ :** శ్రీ విష్ణువును తులసీ దళాలతో పూజించడం, విష్ణు సహస్రనామం పఠించడం.

దాన ధర్మాలు : నీరు, చల్లని పానీయాలు, గొడుగులు, చెప్పులు వంటివి దానం చేయడం.

**ఉపవాసం :** కొందరు ఈ రోజున ఉపవాసం ఉంటారు, లేదా సాత్విక ఆహారం తీసుకుంటారు.

వైశాఖ అమావాస్య, కేవలం ఒక రోజు కాదు, ఒక ఆధ్యాత్మిక యాత్ర. ఇది మన పూర్వీకులను స్మరించడం, దైవాన్ని ఆరాధించడం, మన మనస్సును పవిత్రం చేసుకోవడంతో జీవితంలో శాంతిని, సమృద్ధిని పొందే మార్గం. రామయ్య, కిరణ్ లాంటి వారి కథలు ఈ సంప్రదాయం గొప్పతనాన్ని మనకు గుర్తు చేస్తాయి.


– నిర్మలా జ్యోతి

## కశ్మీర్ హత్యాకాండపై న్యాయవాదుల నిరసన




**పులివెందుల, ఏప్రిల్ 26 (జనస్వరం) :** కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దారుణ హత్యకాండకు నిరసనగా ఉమ్మడి కడప జిల్లా రాయచోటి బార్ సోసియేషన్ న్యాయవాదుల ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రాయచోటి కోర్టు నుండి న్యాయవాదులు, ప్రజా ప్రజాసంఘాలు, న్యాయవాద గుమస్తాలు కలిసి రాయచోటి తహసీల్దార్ కార్యాలయం పాత బస్టాండు, నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. పర్యాటకులను హతమార్చిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయుల ఐక్యతను చాటాలని పాకిస్తాన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. సామాన్యులు ఉగ్రవాదుల తూటాలకు బలికాకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు నినాదాలు చేశారు. ఈ రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డి భాష, భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, రజక సంఘం నాయకులు, రమేష్, శ్రీనివాసులు, రమణ, రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి నాయి బ్రాహ్మణ సంఘం నాయకుడు రమణ, న్యాయ వాదులు టీవీ రమణ హ్యూమయున్ భాష, రాజకుమారి చంద్రిక, వరలక్ష్మి, నాగాముని, ఖాదర్బాషా, జనార్దన్ రెడ్డి, నిరంజన్, చిన్నయ్య, వీరభద్ర, రామాంజనేయులు, సయ్యద్ బాషా, హ్బితుల్లా, అజంతుల్లా, గంప సుబ్బరాయుడు, వెంకటరమణమూర్తి, దేవేందర్ రెడ్డి, శివకుమార్, కేఈటివి రమణ, న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడు సుబ్బరామయ్య, రాజా, రామకృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి : తులసి రెడ్డి



**పులివెందుల, ఏప్రిల్ 26 (జనస్వరం) :** రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన ప్రాంతాల కంటే రాజధాని ప్రాంతంలో విద్య, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఫ్రీజోన్ ప్రకటించడం వల్ల అన్ని ప్రాంతాల వారికి సమాన అవకాశాలు ఉంటాయన్నారు. ప్రస్తుతం అమరావతి జోన్ 3లో ఉండటంవల్ల ఆ ప్రాంతం వారికే విద్య, ఉపాధి అవకాశం ఉంటుందన్నారు. కుటమి ప్రభుత్వం పునరాలోచించికుని అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని కాంగ్రెస్ తరపున డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఇబ్రహీంపట్నంలో నేడు ఉచిత మెడికల్ క్యాంప్

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 26 (జనస్వరం) :** మైలవరం నియోజకవర్గం పరిధిలోని ఇబ్రహీంపట్నంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ముత్తవరపు స్వర్ణ ఏసీ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 8:30 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు కొనసాగనుంది. ఈ మెడికల్ క్యాంపులో అన్ని విభాగాలకు చెందిన 20 మంది సీనియర్ వైద్యులు పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్సలు అందించనున్నారు. క్యాంప్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని), మాజీ మంత్రి, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు శ్రీ నెట్టెం రఘురాం హాజరుకానున్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఓ మంచి ఆలోచన.. విద్యార్థుల భవిష్యత్తుకు నిచ్చెన

**పులివెందుల ఏప్రిల్ 26 (జనస్వరం) :** ఓ మంచి ఆలోచన విద్యార్థుల భవిష్యత్తుకు నిచ్చెన వేసింది.. పైసా ఖర్చు లేకుండా పై చదువులు వెళ్లేందుకు మార్గం చూపింది.. అంతేకాదు తల్లిదండ్రులకు కూడా ఊరట నిచ్చింది.. వందలాది మంది విద్యార్థులకు చేదోడు వాదోడుగా నిలిచింది.. సంవత్సరం కాదు రెండేళ్లు కూడా కాదు దశాబ్దాల పాటు పేద విద్యార్థులకు బాసటగా నిలిచింది.. ఇదే ఉచిత కోచింగ్ సెంటర్ విశిష్ట లక్షణం.. ఈ కోచింగ్ సెంటర్ పూర్వాపరాల వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం కామసముద్రం గ్రామానికి చెందిన మొన్నెల రాజు ఒక చిరు ఉద్యోగి. ఉద్యోగ రీత్యా పులివెందులలో నివాసం ఉంటున్న రాజు స్నేహిత అమృత హస్తం సేవా సమితి అన్న సంస్థను స్థాపించి సామాజిక సేవలపై దృష్టి సాధించారు. ఈ సంస్థకు ఉచిత ఉపాధ్యాయ బృందం తోడు కావడంతో తాను అనుకున్న ఆశయం బలపడింది. విద్యా వ్యవస్థలో మార్పులు చేసి సాంకేతిక విద్య వైపు ప్రభుత్వాలు అడుగులు వేశాయి.. వైద్య విద్యారంగం తో పాటు ఇంజనీరింగ్ విద్యపై కూడా ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాయి. పదో తరగతి పదోతరగతి పాసైన విద్యార్థులకు కూడా సాంకేతిక విద్యను ప్రభుత్వాలు అందుబాటులోకి తీసుకువచ్చాయి.. పట్టణాలతో పాటు గ్రామీణ స్థాయి విద్యార్థులు కూడా సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వాలు పచ్చ జెండా ఊపాయి. దీంతో ఎక్కువ శాతం మంది విద్యార్థులు అటు వైద్యరంగం ఇటు సాంకేతిక రంగం వైపు మక్కువ చూపారు. పదవ తరగతి పూర్తి చేసిన



విద్యార్థులు వైద్యరంగం లేదా సాంకేతిక రంగం వైపు వెళ్లాలంటే ప్రవేశ పరీక్షలో తప్పనిసరిగా ర్యాంకు సాధించాల్సి ఉంది. ర్యాంకు సాధించాలంటే శిక్షణ ఎంతో అవసరం. వేలకు వేలు ఖర్చుపెట్టి శిక్షణ పొందాలంటే అందరికీ సాధ్యం కాదు. ఈ పరిణామ క్రమంలో రాజు ఆలోచనకు వచ్చాడు. పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇప్పిస్తే వారి భవిష్యత్తు బాగుపడుతుందని తన ఆలోచనకు పదును పెట్టాడు. ఈ నేపథ్యంలో 2010 సంవత్సరంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఒక ఉపాధ్యాయుడి సహకారంతో ఏర్పాటుచేసిన ఈ శిక్షణ సెంటర్లో 25 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలి దశలోనే మంచి ఫలితాలు సాధించడం, ఉపాధ్యాయ బృందం సహాయ సహకారాలు లభించడంతో కోచింగ్ సెంటర్‌ను మరింత విస్తరింపజేశారు. నాటి నుండి నేటి వరకు కోచింగ్ సెంటర్ ద్వారా ఎంతోమంది విద్యార్థులు ప్రయోజకులయ్యారు. మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలో అలవోకగా సీట్లు సాధించారు. నాటి నుండి నేటి వరకు ఈ విజయపరంపరులు కొనసాగుతూనే వస్తున్నాయి. ఏడాది కూడా ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ కోచింగ్ సెంటర్లో 170 మంది విద్యార్థులు ఉన్నట్లు సేవా సమితి అధ్యక్షులు రాజు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పేద విద్యార్థులను కూడా ఉత్తమ ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నదే నా సంకల్పం అన్నారు. వేసవి సెలవులు రాగానే చాలామంది ఉపాధ్యాయులు విహారయాత్రలకు వెళ్లడం జరుగుతుందన్నారు. కానీ ఇక్కడ పులివెందులలో మాత్రం ఉచిత ఉపాధ్యాయ బృందం అవన్నీ పక్కన పెట్టి విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా తమకు అన్ని విధాలా సహకరించడం సంతోషంగా ఉందన్నారు. వారి విశిష్ట సేవలు ఆజన్మాంతం గుర్తుపెట్టుకుంటానని, వీరి సహాయంతో భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## డీఎస్సీ విద్యార్థులను నిండా ముంచిన కూటమి ప్రభుత్వం

**కర్రా జయ సరిత**




**పాలకొల్లు, ఏప్రిల్ 26 (జనస్వరం) :** మెగా డీఎస్సీ అని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం డీఎస్సీ విద్యార్థులను నిండా ముంచిందని రాష్ట్ర వైసీపీ మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ కర్రా జయసరిత అన్నారు. శనివారం పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెగా డీఎస్సీకి సంబంధించి 27 వేల పోస్టులు పైగా ఉన్నాయని, మార్కుల అర్హత నిబంధన సాకుతో 16,343 పోస్టులు మాత్రమే ఉన్నాయని, ప్రభుత్వం ప్రకటించడం విద్యార్థులను అన్యాయం చేయడమే అన్నారు. ఇది అర్హులైన డిఎస్సీ అభ్యర్థులపై అనర్హత వేటు వేయడం కాదా అని జయసరిత ప్రశ్నించారు. ఇంటర్ డిగ్రీ మార్కుల అర్హత నిబంధనలను తీసుకువచ్చి ఎనిమిది లక్షలకు పైగా ఉన్న డీఎస్సీ అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లారని ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వం డిఎస్సి అభ్యర్థుల ఆశలను చిదిమేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రతి నిరుద్యోగికి, ఉద్యోగం వచ్చేంతవరకు నిరుద్యోగ భృతి ఇస్తామని, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని, సంపద సృష్టిస్తామని, ఉపాధి కల్పించే విధంగా కంపెనీలను ఏపీకి తీసుకు వస్తామని, బహిరంగంగా ప్రకటించి హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పారని విమర్శించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడు అనే విషయంపై కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని జయసరిత డిమాండ్ చేశారు. మెగాడీఎస్సీలో మార్కుల అర్హత నిబంధన పెట్టి ఎంతోమంది నిరుద్యోగ డీఎస్సీ అభ్యర్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటుందని వ్యాఖ్యానించారు. డీఎస్సీ పరీక్ష నేడు విద్యార్థుల పాలిట విషమ పరీక్షగా మారిందన్నారు. విద్యార్థులకు ద్రోహం చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వంమేనని విమర్శించారు. డీఎస్సీ విద్యార్థులు కోరుకుంటున్నట్టుగా మార్కుల అర్హత నిబంధనను తక్షణమే తొలగించాలని, రోడ్డెక్కి నిరసనలు చేపడుతున్న డీఎస్సీ విద్యార్థులకు న్యాయం చేయాలని వైసీపీ తరఫున జయసరిత డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగుల రక్తదాన శిబిరం

**ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట ఏప్రిల్ 26 (జనస్వరం) :** స్థానిక మార్కెట్ కమిటీ భవనంలో మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వారు ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉద్యోగుల రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతులు మీదుగా ప్రారంభించారు. రెడ్ క్రాస్ డాక్టర్ పరాసార ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. అనంతరం రక్తదానం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను పేరుపేరునా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూనే స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో భాగంగా ఈ రోజు రక్తదానం చేయడం చాలా అభినందనీయమని అన్నదానం చేస్తే ఆరోజు ఆకలి తీరుతుందని, విద్యాదానం చేస్తే మంచి ప్రయోజకులు అవుతారని, కానీ ప్రమాదంలో గాయపడి రక్తం కోసం ఎదురుచూస్తున్న వారికి రక్తదానం చేసి మీరందరూ ప్రాణదాత అవుతున్నారని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్తం దానం ఇవ్వడం ద్వారా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు రాకుండా మంచి ఆరోగ్యంతో జీవనం సాగించవచ్చని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూ నాగబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, ఎమ్మార్వో శ్రీరామ్, సీడీపీఓ పూర్ణిమ, ఎంఈఓ స్వామి, జిల్లా యూటీఎఫ్ నాయకులు పడాల వీర వెంకట సత్యనారాయణ (పీవీ) పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, వీఆర్ఏలు, యూటీఎఫ్ నాయకులు సచివాలయ సిబ్బంది, ఎన్ఆర్జీఎస్ సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు.

# ఇసుక గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదు

- ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్
- ఉపాధి అవకాశాలను అడ్డుకుంటున్న ఉగ్రవాది కేశినేని నాని
- ఉచిత ఇసుకపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- మాజీ ఎంపీ నానికి డూండీ సవాల్



**విజయవాడ, ఏప్రిల్ 26 (జనస్వరం) :** రాష్ట్రంలో పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం అమల్లో ఉంటే ఇసుక దోపిడి జరుగుతోందంటూ అసత్య ఆరోపణలు చేస్తున్న మాజీ ఎంపీ కేశినేని నాని గత ప్రభుత్వంలో లారీ ఇసుక రూ.లక్ష పెట్టి కొన్నారు. ఆ సమయంలో ఎందుకు ప్రశ్నించలేదు? దీనికి సమాధానం చెప్పే ధైర్యం కేశినేని నానికి ఉందా..? అంటూ ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ ప్రశ్నించారు. దమ్ముంటే ఈ విషయాలపై కేశినేని నాని బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. మాజీ ఎంపీ కేశినేని నాని సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర ప్రభుత్వంపై ఎంపీ కేశినేని శివనాథ్‌పై చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండిస్తూ శనివారం విద్యాధరపురంలోని తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డూండీ రాకేష్ మాట్లాడుతూ గత ఐదేళ్లు ఇసుక దోపిడి వల్ల లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. టీడీపీ ఎంపీగా ఉన్న సమయంలో కేశినేని నాని జగన్‌ను ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఆ రోజైనా.. ఈరోజైనా జగన్మోహన్ రెడ్డికి కేశినేని నాని కోవర్టు అన్నారు. ఇసుక గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదన్నారు. తాను రాజకీయలకు దూరం అంటూనే రాజకీయ నాయకుల గురించి ట్వీట్ చేస్తున్నాడు..తను ఏ పార్టీ నాయకుడో కండువా వేసుకొని చేప్పే దమ్ము, ధైర్యం కేశినేని నానికి ఉన్నాయా? అంటూ ప్రశ్నించారు. ఏపీ జెన్‌కో ఫ్లై యాష్ కోసం టెండర్‌కి పలిచింది.. ఆ టెండర్ ఎవరైనా వేసుకోవచ్చు అన్నారు. ఈ విషయం పబ్లిక్ డొమైన్‌లో ఉందన్నారు. కేశినేని నాని క్లీనర్‌కి ఎక్కువ.. ఓనర్‌కి తక్కువ.. మీడియా ముందుకు వచ్చే దమ్ము లేదు. జగన్ పబ్జీ అడుతున్నట్లు కేశినేని నాని కూడా ఫోన్‌లో గేమ్స్ లేదా ట్విట్టర్ లో పోస్టు పెడుతున్నాడని ఎద్దేవా చేశారు. నాని ఎంపీగా ఉన్న సమయంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో గ్రూప్ రాజకీయాలు నడిపారన్నారు. ఎంపీగా చంద్రబాబు నాయుడు అవకాశం ఇస్తే ఆయనకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కేశినేని నాని అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో ఏ రీచ్‌లో అక్రమాలు జరుగుతున్నాయో నిరూపించగలరా? ఎన్టీఆర్ జిల్లాలో ఉచిత ఇసుకపై బహిరంగ చర్చకు కేశినేని నాని సిద్దమా...? ఎన్డీయే కూటమి ఉచిత ఇసుక ఇస్తుంటే కేశినేని నానికి కనబడట్లేదా ? అంటూ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కేశినేని నానికి సరైనా సమాధానం చెబుతామన్నారు. పహల్గాం దాడిలో చనిపోయిన భారత పౌరులకు మౌనం పాటిస్తూ.. దేశ ప్రజలందరూ ఒకేతాటికిపైకి వచ్చి ముక్తకఠంతో పోరాటం చేస్తుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం మరోక రకం ఉగ్రవాదులు తయారైయ్యారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఉగ్రవాదుల ముఖ్య ఉద్దేశ్యం ఎవరకి ఉపాధి అందకుడదు.. ఏ ఒక్కరు వ్యాపారం చేయకూడదు.. రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టి ప్రజల ఆదాయాన్ని దిగజార్చాలని ఏపీలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ఉగ్రవాద కంపెనీకి సంబంధించిన ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వారం రోజులుగా మాజీ నాయకుడు కేశినేని నాని మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఏనాడు ప్రజల సమస్యలపై పోరాటం చేయలేదు.. ట్విట్టర్‌లో ట్వీట్ పెట్టగానే ఆయన వెనుకాల ఉన్న ఉగ్రవాది గ్యాంగ్ చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌పై దాడి చేస్తున్నారని తెలిపారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలు స్థాపించబోయే కంపెనీలకు తక్కువ రేటుకు భూమి ఇవ్వడం తప్పు అని ట్వీట్ చేశాడు.. అంటే ఉపాధి కల్పించే సంస్థలకు భూమి ఇవ్వకుండా ఏమి ఇవ్వాలి? వాళ్ల లాగా లంచాలు తీసుకోవాలా? డబ్బా కంపెనీలకు అనుమతి ఇవ్వాలా? ట్యాక్స్ కట్టకుండా బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకునే కంపెనీలకు వైసీపీ నాయకులు పెట్టారు. నిరుద్యోగ యువత కోసం ఉపాధి కల్పించే కంపెనీలను తీసుకొస్తున్న కూటమి ప్రభుత్వాన్ని స్వాగతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లాహ్, రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు ఆషా, డివిజన్ అధ్యక్షులు పత్తి నాగేశ్వరరావు, శివాజీ ముదిరాజు, కొనికి కొండయ్య, రేగళ్ల లక్ష్మణరావు, సీనియర్ నాయకులు వి.వి.కె నరసింహారావు, సురభి బాలు, శివశర్మ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యలు తలెత్తకుండా చూడండి

**ఎంపీపీ చింతం రెడ్డి పద్మావతి సుబ్బారెడ్డి**



**నెల్లూరు, ఏప్రిల్ 26 (జనస్వరం) :** ప్రస్తుత వేసవికాలంలో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో మండలంలోని 14 పంచాయతీలలో ఎక్కడ మంచినీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సీతారామపురం మండల ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం మండల సర్వసభ్య సమావేశంలో చింతం రెడ్డి పద్మావతి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు పోవాలని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు జరిగే ప్రాంతాలలో కూలీలకు మంచినీరు, ముఖ్యంగా చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వృద్ధులు విశ్రాంతి తీసుకునే విధంగా తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైన చోట మంచినీటి చేతిపంపులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ ఇరు శాఖలు సమన్వయం చేసుకొని గొర్రెల కాపరులకు తాగునీటి తొట్లు, బర్రెల మీసేందుకు గడ్డి పెంపకం, వేసవి సమయంలో కాపరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారికి వివరించాలని తెలిపారు. ప్రస్తుతం మండలంలో చెరువులలో అంతో ఇంతో నీరు ఉందని ఈ నీటిని గొర్రెల కాపరులు ఏ విధంగా ఉపయోగించుకుంటే వర్షాకాలం వరకు వలసలు పోకుండా నివారించగలమో రైతులకు వివరించాలని తెలిపారు. మండలంలో ఇటీవల చేపట్టిన సిమెంట్ రోడ్లు, రచ్చ అరుగుల నిర్మాణాలు 90 శాతం వరకు పూర్తి అయ్యాయని వీటిని ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. విద్యుత్ అధికారులు రచ్చ అరుగుల వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడితే గ్రామ ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి స్థానిక ఆశ వాలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది, సహకారంతో వేసవి సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన ఆరోగ్య సలహాలను వివరించాలని, మట్టికుండల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతేనే చిన్నపిల్లలు, వృద్ధులు, బయటకు వచ్చే విధంగా సలహాలు ఇవ్వాలని తెలిపారు. అడవికి నిప్పు మానవాళికి ముక్కు అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరికి అటవీ అధికారులు తెలియజేసి వేసవికాలంలో అడవులకు నిప్పు పెట్టనీయకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు నేలటూరి శారమ్మ, పీసీ అల్లురు రాజు, మండల తహసిల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, మండల విద్యాధికారి మస్తాన్వలి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరిస్తాం

**మంత్రి నిమ్మల రామానాయుడు**



**పాలకొల్లు, ఏప్రిల్ 26 (జనస్వరం) :** కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను తప్పకుండా పరిష్కరించే ప్రయత్నం చేస్తానని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. శనివారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీరు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. వైద్య ఆరోగ్యశాఖలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ ఆరు సంవత్సరాలుగా విధులను నిర్వహిస్తున్నారు. వీరంతా వారం రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరు మంత్రి నిమ్మలను కలవడం, వినతిపత్రం సమర్పించడం సర్వత్ర చర్చనీయాంశమైంది. సమస్యలపై స్పందించిన మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఉద్యోగులు వేరు ప్రభుత్వం వేరు కాదని అంతా కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి తానెప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. పాలకొల్లు ఎన్జీజీఓ అధ్యక్షులు గుడాల హరిబాబు నేతృతంలో వీరు మంత్రిని కలిసారు. ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షులు శిరీష రాణి, కార్యదర్శి రామరాజు తదితరులు తమ సమస్యలను మంత్రికి విపులంగా వివరించారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌ను వెంటనే విడుదల చేయాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్ 23 శాతం ఇవ్వాలని, ఇంటి అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని, ఆరు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి రామానాయుడు కు అందించామని ఎన్జీజీఓ సంఘ అధ్యక్షులు గుడాల హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేయుచున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


## కూటమి ప్రభుత్వంలో పారదర్శక పరిపాలన..

- టీడీపీ రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం
- మాజీ ఎంపీ కేశినేని నానిపై మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- నాని వ్యాఖ్యలు అజ్ఞానికి నిదర్శనం



**విజయవాడ, ఏప్రిల్ 26 (జనస్వరం) :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో పారదర్శకమైన పాలనతో రాష్ట్రాభివృద్దే ధ్యేయంగా సాగుతుందని టీడీపీ రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం అన్నారు. విజయవాడ పార్లమెంట్ అభివృద్ధి చూసి ఓర్వలేక తనని భారీ మెజార్టీతో ఓడించిన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పై ఈర్ష్యాద్వేషాలతో రాష్ట్రాభివృద్ధి అడ్డుకునేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఎంపీ కేశినేని శివనాథ్‌పై కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో మాజీ ఎంపీ కేశినేని నాని చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ టీడీపీ రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం ఆటోనగర్‌లోని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగాని మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్‌పై అసత్య ఆరోపణలు చేసినందుకు మాచవరం పోలీస్ స్టేషన్ లో నానిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మాజీ ఎంపీ కేశినేని నాని పిచ్చి పరాకాష్ఠకు చేరిందన్నారు. భారీ మెజార్టీతో ఓడించాడనే అసూయతో ఎంపీ కేశినేని శివనాథ్‌పై చేసే అసత్య ఆరోపణలను ఖండించారు. కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ మంజూరు కావటం కోసం టీడీపీ నాయకులు దీక్షలు, ధర్నాలు చేస్తే ఆ విజయం నాని తన ఖాతాలో వేసుకున్నారని ఎద్దేవా చేశారు. నాని వైఖరిని జనం గమనిస్తున్నారని మరోసారి ఛీ కొట్టకముందే తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. జగన్ హయంలో సామాన్యులకు ఇసుక దొరకలేదు. మాఫియా ఏర్పడి ఇసుకను దోచుకున్నారు. ఆ సమయంలో నాని ఎందుకు మౌనం వహించాడో సమాధానం చెప్పాలంటూ ప్రశ్నించారు. మాజీ ఎంపీ నాని గళం ఆ ఇసుక దోపిడిలో వాటాలు తీసుకోవటం మూగబోయిందన్నారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలు అవుతుంటే ఇసుక దోపిడి జరుగుతోందనటం నాని అజ్ఞానానికి నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఫ్లై యాష్‌కి సంబంధించి ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు టెండర్లను పిలిచి పారదర్శకంగా ఉండేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు మీర్జా ఆబిద్ హుస్సేన్, పామర్తి కిశోర్ బాబు, ఇత్తడి చార్లెస్‌లు పాల్గొన్నారు

## తలసేమియా రన్‌కు రూ.30 లక్షల విరాళం



**విశాఖపట్నం, ఏప్రిల్ 26 (జనస్వరం) :** ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే నెల 8వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే 'తలసేమియా రన్'కు లాన్సమ్ ఎన్‌పాయింట్ డెవలపర్స్ ఎల్ఎల్‌పీ గ్రూపు తరఫున ఛైర్మన్ కూనపురెడ్డి ఉమేశ్ రూ.30 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ చెక్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె స్పందిస్తూ.. తలసేమియా రోగుల బాధలను అర్థం చేసుకొని సాయం చేయడానికి ముందుకు వచ్చిన ఉమేశ్‌ను అభినందించారు.

## రాష్ట్రంలో 21 మంది పాకిస్థానీలు

**తక్షణం దేశం వీడాలని పోలీసుల ఆదేశం**

**అమరావతి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** పహల్ గామ్ ఉగ్రదాడిని అత్యంత సీరియస్‌గా తీసుకున్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్రంలోనూ పోలీసులు గట్టిగా అమలు చేస్తున్నారు. పాకిస్థాన్ జాతీయులు తక్షణమే రాష్ట్రం విడిచి వెళ్లి పోవాల్సిందిగా పలు జిల్లాల పోలీసులు ఆదేశించారు. శుక్ర, శనివారాల్లో సమీక్ష నిర్వహించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా రాష్ట్రంలో ఎక్కడ పాకిస్థానీయులు ఉన్నా తక్షణమే వారిని దేశం నుంచి పంపించేయాలని జిల్లాల ఎస్పీలను, పోలీస్ కమిషనర్లను ఆదేశించారు. రంగంలోకి దిగిన పోలీసు, ఇంటెలిజెన్స్ వర్గాలు మొత్తం 21మంది పాకిస్థానీయులు వారిలో 14 మంది ఆదివారం లోపు వెళ్తామని చెప్పగా, మరో ఏడుగురు వైద్య సేవల కోసం వచ్చామని సోమవారం ఆస్పత్రిలో చూపించుకుని ఈనెల 29న దేశం విడిచి పాకిస్థాన్‌కు వెళ్లిపోతామని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ప్రతి ఒక్కరిపై నిఘా పెట్టి అందరినీ ఈ నెల 29లోపు దేశం దాటి పోయేలా చూడాలని ఎస్పీలకు డీజీపీ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దేశ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఏపీలో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా డీజీపీ చెప్పారు.

## హంపోలీ గ్రామంలో అంబేద్కర్ జయంతి



**కుబీర్, ఏప్రిల్ 26 (జనస్వరం) :** రాజ్యాంగం రచయిత డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ జన్మదిన వేడుకలు శనివారం గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. పంచశీల జెండాను, ఆవిష్కరించారు. బుద్ధ వందనాలు చేసి భోజనాలు చేశారు. గ్రామ ప్రజలు పలువురు మాట్లాడుతూ భారత రాజ్యాంగం రాసి ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించారని, ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని వారు కోరారు. బాగా చదవి గొప్ప స్థాయికి ఎదగాలన్నారు. చదువు ద్వారా అన్ని సాధించవచ్చు అని చదువును నిర్లక్ష్యం చేయవద్దని కోరారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 26 (జనస్వరం) :** మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కృష్ణ, డైరెక్టర్ దోమ నర్సింలు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గణపురం వెంకటయ్య గౌడ్ మాటూరి బందప్ప గౌడ్ రైతులు గడ్డమీద కిష్టయ్య గ్రామంలో ఉన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఏవోగా పోలప్ప బాధ్యతలు



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 26 (జనస్వరం) :** మండల నూతన ఏఓగా శనివారం పోలప్ప బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ తులసి కొడంగల్ ఏఓగా కొనసాగుతున్నారు. మండల పరి ధిలోని రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు అందజేస్తానని నూతన ఏఓ పోలప్ప అన్నారు.

## దుద్యాలలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

**హాజరైన జిల్లా కలెక్టర్**



**దుద్యాల, ఏప్రిల్ 26 (జనస్వరం) :** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం భూభారతి ఆర్ఓఆర్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా ఇకపై ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదని అధికారులే ప్రజల వద్దకు వచ్చి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఎమ్మార్వో కిషన్ నాయక్, ఎంపీడీఓ మహేష్ కుమార్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడికి నిరసనగా శాంతి ప్రదర్శన




**భైంసా, ఏప్రిల్ 26 (జనస్వరం) :** పహాల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు అతి కిరతంగా దాడులు జరిపి, వారి ప్రాణాలకు బలి తీసుకోవడం అత్యంత హేయమైన చర్య అని బుద్ధ విహార్ టీం, అంబేద్కర్ విగ్రహం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉగ్రవాదులు దాడులను నిరసనగా, మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహం దగ్గర ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముందు ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కళారాధన ఉచిత లలిత కళల శిక్షణా శిబిరం

**మే 1వ తేదీ నుండి 31 వరకు కళా సాధన పేరిట ఉచిత శిక్షణ**

**నంద్యాల, ఏప్రిల్ 26 (జనస్వరం) :** కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో 23 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉచిత లలిత కళలు, క్రీడల వేసవి శిక్షణ శిబిరం ఈ సంవత్సరం మే 1 నుండి మే 31 వరకు కళా సాధన పేరిట మున్సిపల్ స్కూల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గుర్రాల రవికృష్ణ తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో శాస్త్రీయ నృత్యం, ఆధునిక నృత్యం, శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, వాద్యసంగీతంలో గిటార్, కీబోర్డ్, మిమిక్రీ, వెంట్రిలాక్విజం, చిత్రలేఖనం, చక్కటి చేతిరాత, హస్తకళలు, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, పద్య పఠనం, సంస్కృత శ్లోకాలు, కవితా గానం, కవితా రచన, చదరంగం, కరాటే, టైక్వాండో, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలలో 22 మంది కోచ్‌లతో శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నారు. మే 31న ముగింపు ఉత్సవంలో శిక్షణ పొందిన బాలబాలికల చేత ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. శిబిరంలో పాల్గొన్న ప్రతి వారికి ప్రశంసా పత్రం అందజేస్తారు. శిబిరంలో శిక్షణ పొందడానికి, ముగింపు ఉత్సవంలో ప్రదర్శనలు ఇవ్వడానికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రంగనాథ్ మాట్లాడుతూ వేసవి సెలవులను బాలలు, యువత సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కళలు, క్రీడలు బాలల మానసిక, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని తద్వారా చదువులో కూడా రాణించడానికి అవకాశాలు మెరుగవుతాయన్నారు. యువజన విభాగం అధ్యక్షుడు రంగనాథ్, కోచ్‌లు కళ్యాణి, లలితా సరస్వతి, సుభాషిని, రజాక్, సుదర్శనం, బాలకృష్ణ, నాగేంద్ర, రాజేంద్ర, శివకుమార్, సతీష్, మధు, రాజా ,ఆది, తరుణ్, సీతారాం, రాజ్ కుమార్, సత్యనారాయణ, రామసుబ్బయ్య శిబిరంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

## బాల్యవివాహాల నిర్మూలనకు కుటుంబాల సహకారం అవసరం

**అల్లూరి జిల్లా వైద్యాధికారి జమాల్ బాషా**



**చింతపల్లి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార పక్షవత్సవ స్టాల్స్‌ను అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో ఆయనతో పాటు ఆర్.వి.నగర్, కోరుకొండ ప్రాంత వైద్యాధికారులు డాక్టర్ రవీంద్రనాథ్ చౌదరి, డాక్టర్ శివప్రసాద్ సందర్శించారు. స్టాల్స్ పరిశీలన సందర్భంగా డాక్టర్ జమాల్ బాషా మాట్లాడుతూ, బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారాయని, వాటి నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు ప్రతి కుటుంబం ముందుకు వచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. బాలికలు విద్యార్హతను పూర్తి చేసుకొని జీవితంలో స్వావలంబులు కావడానికి అవకాశం కల్పించాలని, చిన్న వయసులో వివాహం చేయడం వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. అలాగే, గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిన్నారులకు సమగ్ర పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు శరీర ద్రవాల్లో లోపం రాకుండా తరచూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వెనుకబడిన ప్రాంతాల వారు ప్రయాణాల్లో తాగునీరు వెంట తీసుకెళ్లడం తప్పనిసరి. చిన్నారులు ఎండ బారకుండా గొడుగు ఉపయోగించుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అదనపు ప్రాజెక్టు అధికారిణి ఎం.రామలక్ష్మి, సూపర్వైజర్లు కే.విజయకుమారి, ఎస్.కె. గౌహరున్నీషా, ఎస్.గౌరీ, పి.అప్పల నరసమ్మ, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, సత్యవతి, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మూలజంపలో వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన


**మనమిత్ర సేవలను వినియోగించుకోని పిలుపు**




**యలమంచిలి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** నియోజకవర్గంలోని రాంబిల్లి మండలం మూలజంప గ్రామ సచివాలయంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన "మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్"పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జనసేన మండల పార్టీ ఉపాధ్యక్షులు అందుకూరి ప్రసాద్, మాజీ సర్పంచ్ వేగి రాము ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన 9552300009 నెంబర్ను "మన మిత్ర" పేరుతో సేవ్ చేసుకుని "హాయ్" అనే సందేశం పంపడం ద్వారా సుమారు 200 ప్రభుత్వ సేవలను పొందే అవకాశం కల్పించిందని నిర్వాహకులు వివరించారు. త్వరలో ఈ సంఖ్య 500 సేవల వరకు పెంచనున్నట్లు ప్రభుత్వం తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా "హాయ్ అనండి – హాయిగా సేవలు పొందండి" అనే నినాదంతో గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి ఇంటికి ప్రచారం చేయాలని నిర్ణయించారు. ప్రజలందరూ తమ మొబైల్ ఫోన్‌లలో "మన మిత్ర" నెంబర్‌ను సేవ్ చేసుకొని సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ దొరబాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు

**డివిజనల్ అటవీ అధికారి వై.వి. నరసింహారావు**



**చింతపల్లి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** మండల పరిధిలోని అటవీ ప్రాంతాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డివిజనల్ అటవీశాఖ అధికారి వైవి నరసింహారావు తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతర నేపథ్యంలో విలువైన అటవీ సంపదను అక్రమార్కుల నుండి రక్షించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిగినాపల్లి, గుర్రాలగొంది తదితర ప్రాంతాల్లో నిక్షిప్తమైన రంగురాళ్ల క్వారీల వద్ద అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు ముమ్మరమైన చర్యలు చేపట్టామని వివరించారు. మండలంలోని టేకు ప్లాంటేషన్లు, విలువైన అటవీ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించేందుకు స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలతో పాటు ప్రత్యేక సిబ్బందిని నియమించామని చెప్పారు. అటవీ సంపద సంరక్షణలో భాగస్వాములుగా ప్రజలు కూడా తమ వంతు బాధ్యతను చాటుకోవాలని నరసింహారావు పిలుపునిచ్చారు. అటవీ అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని కోరారు. అటవీ సెక్షన్ ఆఫీసర్ ఎం.సింహాచలం, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.విశ్వనాథం, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల సేవలో కూటమి ప్రభుత్వం

**రూ.కోటితో 3 గ్రామాల్లో పనులకు శంకుస్థాపన**

**మంత్రి రామానాయుడు**



**పాలకొల్లు, ఏప్రిల్ 26 (జనస్వరం) :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనునిత్యం రైతులకు మేలు చేయాలని సంకల్పంతో పరిపాలనలో రైతులతో కలిసి అడుగులు ముందుకు వేస్తోందని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో భాగంగా మండలంలో మూడు గ్రామాల్లో రూ.కోటితో పలు అభివృద్ధి పనులకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. రూరల్ గ్రామంలో రూ.17.69 లక్షలతో పెద గరువు (ఎల్ అండ్ టి) ఆవ డ్రైన్ బ్రిడ్జ్ దగ్గర, ఆవ మీడియం డ్రైన్ పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, అదేవిధంగాకొత్తపేట గ్రామంలో రూ. 37 లక్షలతో దిగమర్రు చానెల్‌పై రహదారి గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, పెదమామిడిపల్లి గ్రామంలో రూ.11 లక్షలతో దిగమర్రు చానెల్‌పై రహదారి గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, మరో రూ.17.69 లక్షలతో హేచరి దగ్గరలో రాయల కోడు మైనర్ డ్రైన్‌పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, రూ.16 లక్షలతో హేచరి దగ్గరలో రాయల కోడు మైనర్ తవ్వు పనుల ప్రారంభానికి మంత్రి భూమి పూజలు జరిపి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు స్వాగతం పలికారు. ఆయన మోటార్ సైకిల్‌పై పర్యటిస్తూ ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ 9 నెలల్లో నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించి రూ. 42 కోట్లతో రైతులకు అవసరమైన పనులను పెద్ద ఎత్తున చేపట్టామన్నారు. రాష్ట్రంలో నిధులు సమస్య ఉన్నప్పటికీ దశలవారీగా ప్రతిరోజు రైతు పనులను ప్రారంభిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రైతులకు అవసరమైన గ్రావెల్ రహదారు నిర్మాణాలను చేపట్టామని, నేడు మళ్ళీ ఆ రోడ్లపై రోడ్లు వేస్తున్నామని తెలిపారు. జగన్ ఐదేళ్ల పాలనలో రైతాంగాన్ని పట్టించుకోలేదన్నారు. నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునే విధంగా రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పనిచేస్తున్నానని చెప్పారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోడీల కలయికతో పది నెలల్లో ఎన్నో మంచి కార్యక్రమాలు అమలు చేశామని, ముఖ్యంగా దేశంలో అత్యధిక మందికి పెద్ద మొత్తంలో పెన్షన్ అందిస్తున్న ఘనత సాధించమన్నారు. భర్త చనిపోతే భార్యకు తక్షణం పెన్షన్ ఇచ్చే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టేయమన్నారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని పదివేల నుంచి రూ.20 వేలకు పెంచి ఇస్తున్నామని మంత్రి రామానాయుడు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మానవత్వం ఉన్న ప్రభుత్వంగా పనిచేస్తుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, నూతనంగా ఎన్నికైన ఏఎంసీ చైర్మన్ కోడి విజయ భాస్కర్, పాముల రజిని కుమార్, పెచ్చెట్టి బాబు, జీవి, బోనం నాని, ఉన్నమట్ల కబర్ధి, తులా రామలింగేశ్వరరావు, దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ కౌరు భారతి, సర్పంచ్ రాపాక కరుణాకర్, తమ్మినీడి చంద్రశేఖర్, కౌరు శ్రీ మురళీకృష్ణ, కౌరు సందీప్ కుమార్ కట్ట మురళీధర్, కేత వీర రాఘవులు, రాపాక డేవిడ్ రాజు, కుడక వెంకటేశ్వరరావు బండి పెద్దిరాజు, గుబ్బల కృష్ణ మోహన్, పరువు సామ్యూల్, కౌరు భాస్కర్ బాబు, దిండి లక్ష్మణ రావు, అంబటి శేషగిరి, కౌరు జానకిరామ్, భూపతి చిన్న పెద్దిరాజు, భూపతి సుబ్బన్న, భూపతి లక్ష్మణరావు, కొండేటి సూర్య నారాయణ రావు, ఇంటి శ్రీరాముడు, నిల్ల వీరభద్రం, మాతా రత్నరాజు, రాయి ప్రసాద్, సాగ సత్యనారాయణ, మామిడిశెట్టి పెద్దిరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు

## అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం



**జగ్గంపేట, ఏప్రిల్ 26 (జనస్వరం) :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను జగ్మటి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గవర్నమెంట్ హై స్కూల్ జగ్గంపేట విద్యార్థి అన్నం దేవుల శామ్యూల్ రాజుకి 600కు 579 మార్కులు, జిల్లా పరిషత్ హై స్కూల్ రాజపూడి విద్యార్థిని దేగల సుబ్బలక్ష్మికి 600కు 570 మార్కులు, రాజపూడి హై స్కూల్ విద్యార్థిని పైలా కావ్య శ్రీకి 600కు 568 మార్కులు, జిల్లా పరిషత్ హై స్కూల్ మావిడాడ విద్యార్థిని గౌతమి జోష్నాకు 566 మార్కులు సాధించారు. వీరందరినీ స్థానిక ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండల సభ్యులు జ్యోతుల నెహ్రూ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మీరంతా మరెన్నో ఉన్నత చదువులు చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకొండ బాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, గండేపల్లి జడ్పిటీసీ పరిమి మంగతాయారు బాబు, ఎంఈఓ స్వామి, జిల్లా యూటీఎఫ్ నాయకులు పడాల వీర వెంకట సత్యనారాయణ (పీవీ) మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల జీవితాల్లో ఉద్యోగమేళా వెలుగులు

**62 మంది విద్యార్థులు ఉద్యోగం సాధించిన వైనం**




**నంద్యాల, ఏప్రిల్ 26 (జనస్వరం) :** చదువుకున్న చదువుకు సార్ధకత చేకూరాలంటే ప్రస్తుత సమాజంలో ఒక ఉద్యోగం చాలా అవసరమని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వచ్చిన ఈ సంస్థల ద్వారా 62 మంది ఉద్యోగాలు సంపాదించటం గర్వకారణమని శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఎస్బిఐ కాలనీలో ఉన్న శ్రీ రామకృష్ణ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహించారు. 62 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల డైరెక్టర్ జి హేమంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు కేంద్రంగా దాదాపు 10 కంపెనీలు ఈ ఉద్యోగం మేళలో పాల్గొన్నాయి. పరిసర ప్రాంతాల నుండి సుమారు 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీరామకృష్ణ విద్యాసంస్థలలో ఉద్యోగమేల నిర్వహించిన ఎన్ఐఐటీ, రీసెల్యూట్, టాటా ట్రెండ్, ప్రమోట్ పర్సనల్, పేటీఎం, జస్ట్ డయల్, ఎంఆర్ఎఫ్, కంపెనీలు పాల్గొన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారన్నారు. కంపెనీల నియామక ప్రక్రియ ప్రకారం కొన్ని కంపెనీలు వెంటనే ఉద్యోగాలు కల్పిస్తున్నాయని, వీరికి కనీస వార్షిక ఆదాయంగా రెండు లక్షల నుండి నాలుగున్నర లక్షల పొందుతారని జి. రామకృష్ణారెడ్డి సూచించారు. మరికొన్ని కంపెనీలు తదుపరి ప్రక్రియలో చివరి ఇంటర్వ్యూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో నిర్వహించి వారికి నియామక పత్రాలు అందజేస్తాయని తెలిపారు. కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్లు సంపత్ కుమార్ ఇంతియాజ్ అహమద్‌ను అభినందనలు తెలిపారు. ఎన్ఐటీ కంపెనీలో 12 మంది, పేటీఎం కంపెనీలో 8 మంది, ఎంఆర్ఎఫ్ కంపెనీలలో విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. కళాశాల యామాన్యం ప్రొఫెసర్ జి రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ జి హేమంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ కెబివి సుబ్బయ్య, అధ్యాపకులు అందరూ కలిసి కళాశాల సాంప్రదాయం ప్రకారం కంపెనీ ప్రజలను ఘనంగా సన్మానించారు.

## భక్తుల మనోభావాలు దెబ్బ తినకూడదు

**- సామాన్య భక్తులకు దర్శనం త్వరగా అయ్యేలా చూడాలి**

**- కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**



**నెల్లూరు, ఏప్రిల్ 26 (జనస్వరం) :** రూరల్ నియోజకవర్గ పరిధిలోని శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆర్డీఓ, పోలీస్ శాఖ, వివిధ శాఖల సంబంధిత అధికారులతో శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తూచా తప్పకుండా వారికి కేటాయించిన విధులను సక్రమంగా పాటించాలని కోరారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా, సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం త్వరగా అయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ఫెస్టివల్ కమిటీ చైర్మన్, సభ్యులు ఈఓ అందరూ కలిసికట్టుగా ఏకతాటిపై ఉండి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, దేవరపాలెం గ్రామం ఉప సర్పంచ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, టీడీపీ నాయకులు బాబు, శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన ఫెస్టివల్ కమిటీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 303 అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

**- మే 15న 33 అభివృద్ధి పనులు పార్టీ కార్యకర్తలచే ప్రారంభం**

**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**



**నెల్లూరు, ఏప్రిల్ 26 (జనస్వరం) :** స్థానిక రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ నియోజకవర్గంలో చేపడుతున్న 303 అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి 26 డివిజన్ల ముఖ్య నేతలతో ప్రత్యేక శనివారం సమావేశాన్ని నిర్వహించారు. దాదాపుగా 303 అభివృద్ధి పనుల్లో అదనంగా మరో 20 పనులను కూడా కలుపుకొని మే 15లోపు ప్రారంభం చేసేటట్లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు 330 అభివృద్ధి పనులు సుమారు రూ.40 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించామని, 303 అభివృద్ధి పనులలో దాదాపుగా 90 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. మే 15 తేదీ ఉదయం 9 గంటలకు 303 అభివృద్ధి పనులను 606 మంది పార్టీ కార్యకర్తలు చేతుల మీదుగా అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు.

## ముత్యాలమ్మ జాతర సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు

**అల్లుడు జిల్లా వైద్యాధికారి జమాల్ భాషా**



**చింతపల్లి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** మన్యం ఆరాధ్య దైవం, గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ జాతరను పురస్కరించుకొని, భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ఆర్వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ శిబిరం గురువారం ప్రారంభమైంది. శనివారం ఆర్వి నగర్, కోరుకొండ వైద్యాధికారులు రవీంద్రనాథ్ చౌదరి, శివప్రసాద్‌లతో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.జమాల్ భాషా శిబిరాన్ని సందర్శించి, అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, జాతరకు విచ్చేసే భక్తులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటే వెంటనే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ఔషధాలు, తాగునీటి సదుపాయాలు తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. అంతేకాక, తిరుగు ప్రయాణంలో డా.జమాల్ భాషా లోతుగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడి సదుపాయాలను సమీక్షించారు. అనంతరం కొత్తపాలెం ఆరోగ్య ఉపకేంద్రానికి ఆకస్మికంగా వెళ్లి, చిన్నారులు, గర్భిణీలకు అందిస్తున్న టీకా కార్యక్రమంపై సమగ్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదే సందర్భంగా ఇటీవల మృతి చెందిన ఎంఎల్‌హెచ్‌పీ గసాడి రమ్యశ్రీ మృతికి గల కారణాలను డా. జమాల్ భాషా అడిగి తెలుసుకున్నారు. ఆమె స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, ప్రభుత్వం తరఫున రావాల్సిన సహాయ పథకాలను అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ వైద్యాధికారులు భవాని, హిమబిందు, శివ, ఆరోగ్యశాఖ విస్తరణ అధికారి జి. సింహాద్రి, సిహెచ్ఓ రమణ, బాలయ్య, క్షయ వ్యాధి మండల పర్యవేక్షకులు సిహెచ్. ప్రసాద్, ఏఎన్ఎంలు కె. విజయలక్ష్మి, జె. సత్యవతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కష్టకాలంలో అండగా మురళిరాజు



**ప్రత్తిపాడు ఏప్రిల్ 26 (జనస్వరం) :** నియోజకవర్గంలో ప్రతి నిరుపేదకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వైసీపీ నాయకులు ముదునూరి మురళి కృష్ణంరాజు అండగా నిలుస్తున్నారు. అన్నవరం గ్రామంలో కొల్లు శివ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో వారి పలకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని రూ.5000లు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మురళి రాజు మాట్లాడుతూ కష్టాలలో ఉన్న ప్రతి నిరుపేదకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్, సీనియర్ నాయకులు కొండపల్లి అప్పారావు, వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంకన్న బాబు, తాటిపాక కృష్ణ, కొల్లు గణేష్, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, అన్నవరం గ్రామం ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ హయంలో మాజీ ఎంపీ నాని గళం

# ఇసుక దోపిడిలో వాటాలు తీసుకోవటం వల్లే మూగబోయింది

- ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు
- కేశినేని నాని అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మీడియా సమావేశం
- రాష్ట్రాభివృద్ధి చూసి ఓర్వలేక నానికి కడుపు ఉబ్బరం, కళ్లు మంటలు
- నానికి ఈనో ప్యాకెట్, ఐ డ్రాప్స్ పంపించిన గొట్టుముక్కల



**విజయవాడ, ఏప్రిల్ 26 (జనస్వరం) :** జగన్ పాలనలో ఒక మాఫియాగా ఏర్పడి ఇసుక ను బకాసురులుగా దోచుకున్నారు. 2019 నుంచి 2024 వరకు నాని ఎంపీగా వున్న సమయంలో జగన్ పాలనలో ఇసుక సామాన్యులకు అందుబాటులో లేకపోవటంతో పనులు లేక 64 మంది భవననిర్మాణ ఆత్మహత్య చేసుకున్నారు. జగన్ పాలనలో టన్ను ఇసుక 2000 నుంచి 2400 రూపాయల వరకు అమ్మారు. అప్పుడు సోషల్ మీడియా లో జగన్ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నిస్తూ పోస్టులు పెట్టలేదు. జగన్ దగ్గర ఎంత కమీషన్ పుచ్చుకున్నావు. మాజీ ఎంపీ నాని గళం ఆ ఇసుక దోపిడిలో వాటాలు తీసుకోవటం వల్లే మూగబోయిందంటూ మాజీ ఎంపీ కేశినేని నానిపై ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అలాగే మాజీ మంత్రి జోగి రమేష్‌తో కలిసి వ్యాపార భాగస్వామిగా నాని చేసిన అరాచకాలు విజయవాడ పార్లమెంట్ ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను అడ్డుకోవటానికి జగన్ వదిలిన బాణంగా ఎంపీ కేశినేని శివనాథ్‌పై మాజీ ఎంపీ కేశినేని నాని సోషల్ మీడియాలో చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గొట్టుముక్కల రఘురాజు శనివారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకురావటంతో భవన నిర్మాణ కార్మికులకి పనులు దొరికి ఆనందంగా వుంటే నాని ఎందుకు చూసి ఓర్వలేకపోతున్నాడో అర్ధం కావటం లేదన్నారు. సీఎం చంద్రబాబు యాష్‌కి టెండర్లను పిలిచి పారదర్శకంగా చేస్తుంటే కళ్ల మంటలతో కళ్లు ఉండి గుడ్డివాడిగా యాష్ దోపిడి జరుగుతుందంటూ అసత్య ప్రచారం చేస్తున్నాడన్నారు. అందుకే నానికి కడుపు ఉబ్బరం, కళ్ల మంటలు తను పంపిస్తున్న ఈనో ప్యాకెట్, ఐ డ్రాప్స్ వాడి తగ్గించుకోవాలని సూచించారు. తన ప్రయోజనాల కోసం స్వార్ధపూరిత ఆలోచనలు చేసే కేశినేని నాని విజయవాడ అభివృద్ధిని మాత్రమే కాదు, ప్రజలను, టీడీపీ కార్యకర్తలను ఎనాడు పట్టించుకోలేదన్నారు. శ్రమ ఒకరు పడితే చివరిలో వచ్చి పేరు తాను కొట్టేసేవాడని, కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ విషయంలో కూడా అదే జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ కోసం ఉద్యమాలు చేస్తే.. చివరలో వచ్చి అంతా తనే చేసినట్లుగా క్రెడిట్ దక్కించుకున్నాడని తెలిపారు. ఇలాంటి వ్యక్తి కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఎంపీ కేశినేని శివనాథ్‌పై పెడుతున్న పోస్టులు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు వుందని ఎద్దేవా చేశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపి కేశినేని శివనాథ్ చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక కేశినేని నాని విషం చిమ్ముతున్నాడన్నారు. కేశినేని నాని పార్టీ మారక ముందు కోవర్ట్ పని చేసి, పార్టీ మారిన తర్వాత నుంచి నిలువెల్లా విషం నింపుకుని కాటు వేసే నానిగా మారాడన్నారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలనుకునే ఎమ్మెల్యే జగన్‌కి కేశినేని నాని ఒక బఫూన్‌లా దొరికాడని, అందుకే కేశినేని శివనాథ్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ విష ప్రచారం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా నాని బుద్ది తెచ్చుకుని వైఖరి మార్చుకోకపోతే విజయవాడ ప్రజలు తగిన బుద్ది చెప్పటానికి సిద్దంగా వున్నారని హెచ్చరించారు. మీడియా సమావేశంలో టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్ పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐ ఇన్వేస్టర్లను వెనక్కి పంపించేందుకు అసత్య ఆరోపణలు చేసిన వారిపై

# చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

- టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్
- మాజీ ఎంపీ కేశినేని నానిపై నున్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**విజయవాడ, ఏప్రిల్ 26 (జనస్వరం) :** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేందుకు ముందువస్తున్న ఎన్ఆర్ఐలపై సోషల్ మీడియాలో అసత్య ఆరోపణల చేస్తూ, రాష్ట్రాభివృద్ధి అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న మాజీ ఎంపీ కేశినేని నానిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్ నున్న పోలీసు అధికారులను కోరారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ పై అసత్య ఆరోపణలు చేస్తున్న మాజీ ఎంపీ కేశినేని నానిపై చరణ్ సాయి యాదవ్ శనివారం నున్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై నిజా నిజాలు నిగ్గు తెల్చి దోషులను శిక్షించాలని కోరారు. ఈ సందర్భంగా చరణ్ సాయి యాదవ్ మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కృషి చేస్తుంటే ఓర్వలేక ఎమ్మెల్యే జగన్ తో కలిసి రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకోవటానికి నాని ప్రయత్నిస్తున్నాడన్నారు. సీఎం చంద్రబాబు యాష్‌కి టెండర్లను పిలిచి పారదర్శకంగా ఎండేలా చేస్తున్నాడన్నారు. ఉచిత ఇసుక విధానం అమల్లో వుంటే ఇసుక దోపిడి జరిగిందని విషప్రచారం చేస్తున్న, జగన్ పాలనలో ఇసుక మాఫియా ఇసుకాసురులుగా మారి ఇసుకను దోచుకున్నప్పుడు నాని ప్రశ్నించకుండా ఉండేందుకు జగన్ దగ్గర భారీగా కమీషన్ పుచ్చుకున్నాడన్నారు. ఇది ప్రజల ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం.. కూటమి ప్రభుత్వంలో పారదర్శక పరిపాలన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్, 61 డివిజన్ అధ్యక్షులు ఆకులు సూర్యప్రకాష్ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కిషోర్ శివ,యువ కిషోర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# టీడీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

**ప్రగడ నాగేశ్వరరావు**



**యలమంచిలి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు బీమా, ఇన్సూరెన్స్ పత్రాలను పంపిణీ చేశారు. పెద్దపల్లి గ్రామానికి చెందిన బొద్దపు దేవి, రాంబిల్లి మండలం గోరపూడి గ్రామానికి చెందిన లాలం మంగతల్లి, వాడ్రాపల్లి గ్రామానికి చెందిన పిల్లి సింహాచలం బీమా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్ కుమార్, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, టీడీపీ యువ నాయకులు లాలం భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ "టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు 10 రోజుల్లోనే 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేయిస్తున్నాం. త్వరలోనే సీఎం సహాయనిధి చెక్కులను కూడా లబ్ధిదారులకు అందజేస్తాం," అని తెలిపారు. అలాగే, త్వరలో టీడీపీ సంస్థాగత ఎన్నికలు ప్రారంభం కానున్నాయని, ప్రతి కార్యకర్త విజయం సాధించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కులుకులూరి విజయబాబు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాజాన సూర్య నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు గొర్లి నానాజీ, కార్యదర్శి ఆడారి రమణబాబు, రాంబిల్లి మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, క్లస్టర్ ఇంచార్జిలు ఆడారి ఆదిమూర్తి, బొద్దపు రమణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొటారు సాంబ, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, యూనిట్ ఇంచార్జిలు కరణం రవికుమార్, పిల్ల అది బాబు, ఆడారి చిన్నారావు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు నమ్మి రమణ, దంట్ల వెంకటస్వామి, పండూరి శ్రీను, నానేపల్లి సుబ్బయ్య నాయుడు, లాలం రాము, సేనాపతి తులసీరామ్, గొర్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.


# 200 పని దినాలు, రూ.600లు కూలి ఇవ్వాలి: సీఐటీయూ

**ఏటికొప్పాకలో ఉపాధి కార్మికుల సమావేశం**



**యలమంచిలి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** నియోజకవర్గంలోని ఏటికొప్పాక గ్రామంలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ యలమంచిలి మండల కార్యదర్శి చింతకాయల శివాజీ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో పని దినాలను 200 రోజులకు పెంచాలని, కూలి మొత్తాన్ని 600 రూపాయలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కార్మికులకు 307 రూపాయల కూలి చెల్లిస్తున్నప్పటికీ, అది సమకాలీన ధరల పెరుగుదల్ని గమనిస్తే చాలదని శివాజీ అభిప్రాయపడ్డారు. పైగా, నగదు చెల్లింపులు సకాలంలో జరగకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారాల తరబడి బకాయిలు పెరిగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాబట్టి, ప్రతి వారం నగదు చెల్లింపులు చేయాలని, పని చేసిన కార్మికులకు పూర్తి స్థాయిలో పారితోషికం అందేలా చూడాలని, అలాగే కూలి మొత్తాన్ని 600 రూపాయలకు పెంచాలని, పని దినాలను 200 రోజులకు విస్తరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షులు గండి చెట్టు సత్యనారాయణ, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

# వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభం



**ప్రత్తిపాడు, ఏప్రిల్ 26 (జనస్వరం) :** నియోజకవర్గంలోని అన్నవరం గ్రామంలో బాటసారులకు వాహన దారులకు దాహార్తిని తీర్చేందుకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నియోజకవర్గ వైసీపీ నాయకులు ముదునూరి మురళీ కృష్ణం రాజు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్, సీనియర్ నాయకులు కొండపల్లి అప్పారావు, వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంకన్న బాబు, తాటిపాక కృష్ణ, కొల్లు గణేష్, బీర్ల ప్రసాద్, ఈగల రాఘవ, మేరపల బాబురావు, రాయుడు రాజు, గుల్ల ఆనంద్, పలివెల కొండలరావు, గంపల సత్తిబాబు, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వర రావు, జువ్వల దొరబాబు, అన్నవరం గ్రామం ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక పూజలతో ప్రారంభమైన అన్నప్రసాద వితరణ

- ముత్యాలమ్మ ఆలయంలో భక్తులకు భక్తిపూరిత అన్నసమారాధన
- ప్రత్యేక పూజలతో ప్రారంభమైన ఉత్సవ కార్యక్రమం



**చింతపల్లి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** స్థానిక గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, పోతురాజు బాలయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయ పురోహితులు మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులకు భక్తిపూరితంగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, అన్నదానం పుణ్యాన్ని పొందాలని భావిస్తూ పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తిసంద్ర వాతావరణంగా మారి, ధార్మిక ఉత్సాహాన్ని ప్రదర్శించింది. గ్రామస్థులు, మండల ప్రజలు విరాళాలు అందించి అన్నసమారాధన కార్యక్రమానికి విశేషంగా తోడ్పడ్డారు. శుభ్రమైన ఏర్పాట్లతో అన్నదానం మరింత సుగమంగా కొనసాగింది. భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందుతూ తమ కుటుంబ సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. నిర్వాహకులు భవిష్యత్‌లో అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో పైల శ్రీనివాస్, తాటిపాకల నాగేశ్వరరావు, రీమల మౌళి తదితర గ్రామస్తులు పాల్గొని కార్యక్రమానికి మరింత ఆదరణ అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పెద్దిరెడ్డిల బేతాళుడు, గంజారి రమణ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దొంగతనాల కేసులో నిందితుల అరెస్ట్

**డీఎస్పీ మురళి నాయక్**



**పులివెందుల, ఏప్రిల్ 26 (జనస్వరం) :** పట్టణంలో కొంతకాలంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ మురళి నాయక్ వెల్లడించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం నిందితులను మీడియా ముందు ఆయన హాజరుపరిచారు. ఆయన మాట్లాడుతూ నవీన్, గంగాధర, గణేష్ ముగ్గురు కలిసి ఏడాదిగా దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. తాళాలు వేసిన ఇంటిని టార్గెట్ చేయడం ఆ తర్వాత ఇంటి బీగాలు పగలగొట్టి చొరబడి దొంగతనాలు చేయడం అలవాటు చేసుకున్నారన్నారు. వాటిని విక్రయించడం ద్వారా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసే వారన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు సీఐలు చాంద్ బాషా, రమణలతో కూడిన ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. విచారణలో భాగంగా వీరపనేని పల్లె మార్గంలో సంచరిస్తున్నారన్న సమాచారాన్ని తమ సిబ్బంది సేకరించారన్నారు. అక్కడికి వెళ్లి సిబ్బందిని చూసి దొంగలు పరారవుతున్న నేపథ్యంలో వారిని వెంబడించి పట్టుకున్నామన్నారు. వారి నుంచి బంగారు నగలు, వెండి, ఒక టీవీ ప్రయాణం చేసుకున్నామని తెలిపారు. వాటి విలువ సుమారు రూ.23 లక్షల దాకా ఉండవచ్చని ఆయన అంచనా వేశారు. అలాగే ఫిర్యాదు దారులు కూడా ఖచ్చితమైన సమాచారం అందించాలని ఆయన కోరారు.

# పహల్గామ్ ఉగ్రదాడిపై జనసేన నిరసన ర్యాలీలు

**నాయకులకు, కార్యకర్తలకు దారం అనిత అభినందనలు**



**మదనపల్లె, ఏప్రిల్ 26 (జనస్వరం) :** జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పహల్గామ్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిలో బలైన భారతీయు లకు నివాళులర్పిస్తూ, ఉగ్రవాద చర్యలపై తీవ్ర నిరసనలు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించిన సంతాప సభలు, నిరసన ర్యాలీల్లో నియోజకవర్గం జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దేశ భక్తి ప్రదర్శిస్తూ ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికి రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్, రాష్ట్ర నా సేనకు నా వంతు కమిటీ కోఆర్డినేటర్ దారం అనిత ప్రత్యేక అభినందనలు తెలిపారు. "దేశం పట్ల మీ అందరి అభిమానానికి, బాధ్యతను చాటిన విధానికి హృదయపూర్వక ధన్యవాదాలు," అంటూ ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె "భారత్ మాతాకి జై" నినాదంతో అందరిని ప్రోత్సహించారు.

# దళితుడిపై దాడికి పాల్పడిన ఊసా రాజేష్‌ను జనసేన పార్టీ నుండి శాశ్వతంగా బహిష్కరించాలి

**జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ**



**వేమూరు, ఏప్రిల్ 27 (జనస్వరం) :** నియోజకవర్గంలోని చావలి గ్రామానికి చెందినటువంటి పోతుల కొండయ్యను కొద్ది రోజుల క్రితం కులం పేరుతో దూషించి బహిరంగంగా చెప్పుతో కొట్టి దాడికి పాల్పడినటువంటి జనసేన పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఉసా రాజేష్‌ను అధిష్టానం పార్టీ నుండి శాశ్వతంగా బహిష్కరించాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది దోవా రమేష్ రాంజీ డిమాండ్ చేశారు. శనివారం రేపల్లెలో ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాలకు ఆర్థికచేయూతన అందించేందుకు ప్రభుత్వాలు ఇస్తున్నటువంటి రుణాలను పాలక పార్టీలకు చెందినటువంటి రాజకీయ నాయకులు బినామీ పేర్లతో దండుకుంటున్నటువంటి విషయం అందరికీ విదితమేనన్నారు. వేమూరు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ చావలి గ్రామానికి చెందినటువంటి కొంతమంది దళితులను బినామీగా పెట్టుకుని వారి చేత ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. బినామీకి సహకరించని పోతుల కొండయ్యను చావలి సెంటర్లోకి పిలిచి కులం పేరుతో దూషించి బహిరంగంగా చెప్పుతో కొట్టి దాడికి పాల్పడినటువంటి విషయం పైన పోలీసు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ.. నేటి వరకు జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ కానీ రాష్ట్ర పార్టీ అధినాయకత్వం గానీ ఊసా రాజేష్ పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. జనసేన పార్టీ అధినాయకత్వానికి దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాజేష్ ను జనసేన పార్టీ నుండి శాశ్వత బహిష్కరణ చేయాలని కోరారు. లేనిపక్షంలో దళిత సంఘాలను కలుపుకొని బహిరంగ ఆందోళనలకు సైతం సిద్ధపడతామని హెచ్చరించారు. ప్రధాన రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఆయా పార్టీల నాయకులు అధికార బలంతో దళితులపై దాడులకు హత్యాకాండలకు పాల్పడటాన్ని చూస్తున్నామని, జనసేన పార్టీ సైతం ఇటువంటి దుశ్చర్యలను సత్వరమే ఖండించి క్రమశిక్షణ చర్యల కింద చర్యలు తీసుకోకపోతే అదే కోవలోకి నెట్టి వేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రా బాబురావు పి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

# జనసేన నేత రాజేష్ కు పార్టీ నుండి షోకాజ్ నోటీసులు

**వేమూరు, ఏప్రిల్ 26 (జనస్వరం) :** దళిత యువకుడుపై దాడి చేసి కుల దూషణ చేసిన జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ కు పార్టీ అధిష్టానం నుండి షోకాస్ నోటీసులు అందాయి. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన భౌతుల కొండయ్యను కార్పొరేషన్ రుణాల కోసం బినామీగా ఉండలేదన్న అక్కసుతో చెప్పుతో కొట్టి కుల దూషణ చేసిన దానిపై కేసు నమోదు కాగా పార్టీ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందన్న కారణాలతో పార్టీ అధిష్టానం రాజేష్‌కు షోకాజు నోటీసులు అందజేసింది. 48 గంటల్లో ఈ వివాదానికి సంబంధించి వివరణ ఇవ్వాల్సిందిగా నోటీసులో పేర్కొంది. అయితే పార్టీ అధిష్టానం ఈ వివాదంపై సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తుంది. వివరణ అనంతరం పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయని జనసేన పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

# ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన బి.వి.రామ్

- నేను వైసీపీ కోవర్టునో లేక తెలుగుదేశం పార్టీ అభిమానినో మీరే చెప్పాలి
- పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు ఢిల్లీ స్థాయిలో ద తెలుగు శక్తి పోరాటం చేసిందని ప్రస్తావన



**ఎచ్చెర్ల, ఏప్రిల్ 26 (జనస్వరం) :** నేను వైసీపీ కోవర్టునో లేక తెలుగుదేశం పార్టీ ని.. చంద్రబాబు నాయుడుని అభిమానించే వ్యక్తినో.. మీరే చెప్పాలి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్ద ప్రస్తావించారు. శనివారం ఎచ్చర్ల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును బి.వి.రామ్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రామ్ చంద్రబాబుతో మాట్లాడుతూ ఇటీవల టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తనను అవమానించారని, అంతేకాకుండా తన అనుచరులతో వైసీపీ కోవర్టు అని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో తాను ఏమిటో మీరే చెప్పాలని చంద్రబాబు వద్ద రామ్ ప్రస్తావించారు. వైసీపీ ప్రజా కంటక పాలన కొనసాగిస్తున్న సమయంలోను, మిమ్మల్ని అక్రమ కేసులో జైలులో పెట్టిన సందర్భంలోనూ .. తెలుగు శక్తి వీరోచితంగా ఢిల్లీ స్థాయిలో చేసిన పోరాటం కోసం వివరించారు. ఈ పరిస్థితులలో పల్లా శ్రీనివాసరావు తనపైన నిందలు వేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అంతే కాకుండా మీ జన్మదినం హోటల్ దశపల్లాలో నిర్వహించానని, ఆ కార్యక్రమానికి హాజరైన వారిని కూడా పల్లా అనుచరులు బెదిరించారన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ అన్ని విషయాల పైన దృష్టి సారించి తగిన న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు.